క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన కార్పొరేటర్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసైని కలిశారు. అన్ని డివిజన్ల మాదిరి తన డివిజన్‌లో కూడా అభివృద్ధి పనులకు నిధులు కేటయించేలా చూడాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు మహిళా విభాగం జిల్లా నాయకురాలు దొడ్డా అరుణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్‌మేళా

కూసుమంచి: కూసుమంచిలోని ఎస్వీఎస్ కళాశాలలో ఈనెల 26న మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఎంపీ, హెటిరో గ్రూప్ అధినేత డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి సౌజన్యంతో ఈ జాబ్‌మేళా నిర్వహించనుండగా, 2020 నుంచి 2023 వరకు ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, బీఎస్సీ, బీకాం, బీఏ, బీటెక్(ఎలక్ట్రానిక్, మెకానికల్), ఎమ్మెస్సీ, ఎంఫార్మసీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని బాధ్యులు తెలిపారు.

నేత్రదానం..

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కాజా సంపత్‌కుమార్, మల్లెల నాగమణి, అర్వపల్లి విజయలక్ష్మి, సోమా ధనలక్ష్మి, ఇరుకుల కృష్ణమూర్తి, మిట్టకోలు వెంకటేశ్వర్లు, సోలాస గోవర్ధన్‌రావు, మారం శివనారాయణ మృతి చెందగా.. వారి నేత్రాలను కుటుంబ సభ్యులు నేత్రనిధికి దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ వాసన్, అగర్వాల్ అపోలో ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని శ్రీశ్రీశ్రీసద్గురు సాయినాథ్ మందిరంలో గురువారం బాబాకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం,యాదమ్మ దంపతులు ప్రారంభించారు. ఆలయ కమిటీ బాధ్యులు వల్లభనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నియామకం



గణేష్ జ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల ఎంప్లాయీస్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గణేష్ జ్యోతిని నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. కేఎంసీలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న జ్యోతిని రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించడం పట్ల సంఘ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శలు

ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండాకు చెందిన బానోత్ బాజు(49) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా.. వైఎస్సార్‌టీపీ నాయకుడు సంద్యాల రవీందర్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు బత్తిని యాలాద్రి, ఉపేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జెడ్పీచైర్మన్..

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని బర్లగూడెం గ్రామానికి చెందిన మూడ్ సంగీత ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో.. బాధిత కుటుంబాన్ని భద్రాద్రి జెడ్పీచైర్మన్ కోరం కనకయ్య గురువారం పరామర్శించారు. మండల రాము, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, బి.శారదా, గుగులోతు నాగార్జున, రావూరి సతీష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన లొడంగి నిర్మల రోజుమాదిరిగానే గురువారం స్థానిక డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం వైపు పశువులను మేతకు తీసుకెళ్లింది. ఆమె గొడుగు పట్టుకుని వెళ్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ గురైంది. దీంతో ఆమె రెండు చేతులకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన నజీర్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి తిరిగి వెళ్తుండగా కోదాడ నుంచి నేలకొండపల్లి వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన నజీర్‌కు స్థానికంగా చికిత్స చేయించి ఖమ్మం తరలించారు.

సిబ్బంది లేక ఇబ్బంది



కేఎంసీలో టౌన్ ప్లానింగ్‌లో ఖాళీగా పోస్టులు

- మున్సిపాలిటీ కాలం నాటి సిబ్బందితోనే నెట్టుకొస్తున్న అధికారులు
- పని ఒత్తిడితో సతమతమవుతున్న వైనం
- పర్యవేక్షణ, అనుమతుల మంజూరులో నిర్లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: పురపాలక సంఘం నుంచి నగర పాలక సంస్థగా రూపాంతరం చెందిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న ఖమ్మం పురపాలక సంఘాన్ని 2012, అక్టోబర్‌లో ప్రభుత్వం నగర పాలక సంస్థగా ప్రకటించింది. తదనంతరం విలీన గ్రామపంచాయతీలను కలుపుకుని 60 డివిజన్లతో ఖమ్మం కార్పొరేషన్ విస్తరించింది. నగర విస్తరణలో నిర్మాణాలదే కీలకం. అయితే నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను మంజూరు చేసే కీలక విభాగమైన టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. మున్సిపాలిటీ కాలం నాటి మంజూరు పోస్టులు కూడా ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్పొరేషన్ పరిధిలో నిర్మాణ రంగాలకు సంబంధించిన అనుమతులు, పర్యవేక్షణ, ఇతర అంశాల్లో పాలన కుంటుపడుతోందనే విమర్శలున్నాయి.

పర్యవేక్షణ కరువు..

టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరతతో నగరంలో నిర్మాణాల పర్యవేక్షణ కొరవడింది. అనుమతుల మంజూరు ఒక విధంగా ఉంటే.. నిర్మాణాలు మాత్రం మరోలా జరుగుతున్నాయి. ఇక కొన్ని ప్రాంతాల్లో అసలు అనుమతులు లేకుండానే భవనాలను నిర్మిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది తక్కువగా ఉండడంతో అక్రమ నిర్మాణదారులకు వరంలా మారింది. ఇక ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి కేఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవే కాకుండా ఇతర బాధ్యతలను అప్పగిస్తుండడంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు.

పోస్టుల వివరాలిలా..

పోస్టు	ఉండాల్సినవి	ఉన్నవి
డీసీపీ	1	1 (త్వరలో రిలీవ్)
ఏసీపీ	2	0
టీపీఓ	1	1
టీపీఎస్	3	3
టీపీబీఓ	3	0
క్లర్క్	2	1
కంప్యూటర్ ఆపరేటర్లు	2	2

సగం పోస్టులు ఖాళీనే..

ఖమ్మం నగర పాలక సంస్థగా రూపాంతరం చెందిన తర్వాత టౌన్ ప్లానింగ్ విభాగంలో కొత్త పోస్టులను మంజూరు చేయలేదు. అయితే మున్సిపాలిటీగా ఉన్న సమయాన ఉన్న పోస్టులనే నగర పాలక సంస్థ అయిన తర్వాత కూడా కొనసాగిస్తూ వచ్చారు. ఒక డీసీపీ పోస్టు మినహా.. ఏసీపీ, టీపీఓ, టీపీఎస్, టీపీబీఓ, క్లర్క్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల విభాగాల్లో సరిపడా సిబ్బంది లేరు. ఏడాది క్రితం వరంగల్ నుంచి వచ్చిన ఓ ఉన్నతాధికారి కోసం డీసీపీ (డిప్యూటీ సిటీ ప్లానర్) పోస్టును ఇక్కడ సృష్టించారు. కీలక అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విభాగంలో పనులు సకాలంలో జరగడం లేదు. ఇక అనుమతులు ఆలస్యంగా మంజూరవుతున్నాయి. ఇద్దరు ఏసీపీలు ఉండాల్సి ఉండగా.. ఒక్క అధికారిణి ఏసీపీగా పనిచేస్తూ కొన్ని నెలల క్రితం పదోన్నతిపై హైదరాబాద్ వెళ్లగా.. రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇక డీసీపీ కూడా ఇటీవల ఇక్కడి నుంచి పదోన్నతిపై హైదరాబాద్ వెళ్లడంతో ఆ పోస్టు కూడా ఖాళీ అయింది. ఉన్న టీపీఓకు ఏసీపీ ఇన్‌చార్జ్ ఇవ్వడంతో రెండు బాధ్యతలను నిర్వర్తించడంలో ఇబ్బందులు పడుతున్నారు.

ఏ నష్టం జరగనివ్వొద్దు..

- పోస్టాఫీస్ పాత భవనం కూల్చివేతకు నోటీసులు జారీ చేయండి
- రోడ్లపై గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలి
- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



శిథిలావస్థకు చేరిన పాత పోస్టాఫీస్ భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి



కేఎంసీ వ్యాపార సముదాయ భవనంలోని పై అంతస్తును పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: శిథిలావస్థకు చేరిన భవనాలు, గోడలతో నష్టాలు జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం నగరంలోని పాత పోస్టాఫీస్ భవనాన్ని, పాత బస్టాండ్ వద్ద శిథిలావస్థకు చేరిన భవనాన్ని, ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద పాత రైతు బజార్‌లో ఉన్న గోడను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన భవనాలకు సంబంధించిన వారికి నోటీసులు జారీ చేసి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత పోస్టాఫీస్ భవనాన్ని పరిశీలించాక చుట్టూ ఉన్న వారిని ఖాళీ చేయించాలని, అలాగే పాత బస్టాండ్ వద్ద కేఎంసీకి చెందిన వ్యాపార సముదాయ భవనంలో పై అంతస్తు శిథిలావస్థకు చేరడంతో కింద దుకాణదారులను ఖాళీ చేయించి పై అంతస్తును తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో శిథిలావస్థ భవనాలను గుర్తించి వాటి యజమానులు, అధికారులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి..

నగరంలోని రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని, గతుకుల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యాన డ్రెయినేజీలు పొర్లనున్నాయని, తెరిచి ఉన్న మ్యాన్ హోల్స్ వెంటనే మూయించేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ఈ వర్షాలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సాయిరామ్, టీపీఎస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ప్రాణాలతో చెలగాటం వద్దు..



డాక్టర్‌తో మాట్లాడుతున్న అల్లిక వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: పేద ప్రజలకు వైద్యం అందించటంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని బీఎస్పీ పాలేరు ఇన్‌చార్జ్ డాక్టర్ అల్లిక వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులతో పాటు వైద్యుడు కె.రాజేష్‌తో మాట్లాడి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవటంతో పాటు వైద్యుల కొరతతో పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదని ఆరోపించారు. మొత్తం 19 మంది వైద్యులకు కేవలం ముగ్గురితో రెండు ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే వైద్యులను నియమించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పీ.సీ. వీరస్వామి, మండల అధ్యక్షుడు రమేష్, పాలేరు మాజీ ఇన్‌చార్జ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు టీఎన్జీవోస్ నాయకుల వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: టీఎన్జీవోస్ అనుబంధ మెడికల్, హెల్త్ ఫోరం కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన బుద్ధా రామకృష్ణ, వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.డీ.వలీతో కలిసి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ తదితరులు గురువారం డీఎంహెచ్‌ఓ మాలతిని కలిశారు. ఈ సందర్భంగా యాప్ విధానంలో హాజరు నమోదు తదితర సమస్యలు వెల్లడించి పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో నందగిరి శ్రీను, జీ.ఎస్.ప్రసాద్‌రావు, శాబాసు జ్యోతి, మల్లీశ్వరి, స్వప్న, వై.శ్రీనివాసరావు, పురుషోత్తంరెడ్డి, భాస్కర్, దేవేందర్, సత్యనారాయణ, మన్సూన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓకు శుభాకాంక్షలు..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఏఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అరుణను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ ఆధ్వర్యాన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

జైనుల దుకాణాలు బంద్

ఖమ్మంగాంధీచౌక్: కర్నాటకలో జైనుల మత గురువు ఆచార్య కామకుమార్ నందీజీ హత్యకు నిరసనగా దేశ వ్యాప్త జైనుల బంద్‌లో భాగంగా గురువారం ఖమ్మం నగరంలోని జైనులు నిర్వహిస్తున్న దుకాణాలను మూసి ఉంచారు. ఖమ్మంలోని జైనుల మత గురువుకు నివాళులర్పించి, సంతాపం తెలిపి హత్య చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైన మతస్తులు కాలా ఇందూ, సీతల్, విమల్, సంతోష్, సంజయ్, మనీష్, అనిల్, రాజు, విజయ్, అపరాజిత మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినోబా నవోదయ కాలనీ ప్రజలకు న్యాయం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వెలుగుమెట్ల వినోబా నవోదయ కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని గ్రామీణ పేదల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ అక్తరున్నిసా బేగం మాట్లాడారు. భూదాన్ భూముల్లో కొందరు గుడిసెలు వేశారని ప్రచారం చేస్తున్నారని, విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. చట్టబద్ధమైన భూదాన ఇళ్ల స్థలాలకు సర్వ హక్కులు ఉన్నాయని, మంచి నీళ్లు, కరెంట్ ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. తక్షణమే ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బల్లి శ్రీనివాసరావు, గడ్డి వెంకటనర్సమ్మ, పరిసినేని ఉమ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు..



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

కామేపల్లి(కారేపల్లి): కాంగ్రెస్ పార్టీ బీ-ఫాంతో ఇల్లెందు ఎమ్మెల్యేగా కార్యకర్తల రెక్కల కష్టంపై గెలిచి, కన్నతల్లిలాంటి కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యే హరిప్రియకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత లేదని.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అన్నారు. గురువారం పాతలింగాలలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్‌లోకి వెళ్లానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, సీతారామ ప్రాజెక్టు, నిరుద్యోగ సమస్యలు, పోడు భూముల విషయాలపై ఏనాడైనా అసెంబ్లీలో నోరు విప్పారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే.. గోవింద్రాల ఘటన పునరావృతమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, గోపిరెడ్డి, నల్లమోదు లక్ష్మయ్య, దేవండ్ల రామకృష్ణ, చల్ల మల్లయ్య, కవిరాజు, విశ్వానాథం, నల్లమోతు మురళి, మాలోతు బావ్‌సింగ్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, మేకల అశోక్, పింగళి రామ్మూర్తి, ఒంగూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మిత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: పేద విద్యార్థిని టి.అఖిలకు మిత్ర ఫౌండేషన్ బాధ్యులు ల్యాప్‌టాప్ అందించడం హర్షనీయమని, వారి సేవలు అభినందనీయమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. గురువారం ఫౌండేషన్ తరఫున ఎస్‌బీఐటీలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న అఖిలకు సమకూర్చిన ల్యాప్‌టాప్‌ను గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్, కార్యదర్శి రంగా శ్రీనివాసరావు, చారుగుండ్ల రవి, యుగంధర్, పాలవరపు శ్రీను, నాగసాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల తొలగింపు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను విద్యా సంవత్సరం మధ్యలో తొలగించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెట్టిన మెరిట్ ఆధారంగా, ఇంటర్వ్యూల్లో త్రిసభ్య కమిటీ ఎంపిక చేసిన గెస్ట్ లెక్చరర్లను ఇప్పటికిప్పుడు తొలగించి, కొత్త వారిని తీసుకోవాలనే నిర్ణయం సరికాదన్నారు. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు ఫర్వీన్, వెంకటేష్, సంగీత, సరళ, వీరేందర్, తరుణ్, సుమలత, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే 'యూసీసీ'

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే బీజేపీ ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ)ని తీసుకొస్తుందని తన్జీమ్ ఏ ఇన్సాఫ్ కార్యదర్శి మహ్మద్ సలాం అన్నారు. గురువారం సంఘం ఆధ్వర్యాన యూసీసీ వలన కలిగే నష్టాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను స్థానిక ఎన్ఎస్‌టీ రోడ్డులో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యూసీసీని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు యానాలీ సాంబశివరెడ్డి, ఎస్‌కె.సైదా, యాకుబ్, రెహమాన్, షరీఫ్ పాల్గొన్నారు.

'రెజొనెన్స్'లో ఎల్లో డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో గురువారం ఎల్లో డే వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, శ్రీధర్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపు రంగు దుస్తులు, బొమ్మలు, బెలూన్లలో ఆకర్షణీయంగా కనిపించారు. ప్రిన్సిపాల్ మొగల్ అన్వర్ బేగ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



శివపార్వతికి చెక్కు అందజేస్తున్న మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న నేపథ్యాన ఖమ్మం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రకటించిన రూ.లక్షతో పాటు మేయర్ నీరజ వ్యక్తిగతంగా రూ.15వేలు కలిపి చెక్కును గురువారం విద్యార్థిని నల్లమోతు శివపార్వతికి అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ పేద విద్యార్థినిని చదివించేందుకు ముందుకు రావడం హర్షణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాదు లక్ష్మణరావు, మద్దినేని ప్రసాదరావు, శ్రీరామినేని చంద్రశేఖరరావు, యలమద్ది వెంకటేశ్వర్లు, రమణారావు, ఆళ్ల వెంకటరావు, వినోద్, కొంగర పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి..

రఘునాథపాలెం: రఘునాథపాలెంకు చెందిన బుట్టి కిరణ్, సుజాతల కుమార్తె కీర్తిప్రియ చదువు కోసం ఎం.బాబూరావు గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి జేఈఈ మెయిన్స్‌లో కాన్పూర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమని, చదువుకోసం ఆర్థికంగా ప్రోత్సహించాలని తన వంతుగా ఈ వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ బి.జి.క్లెమెంట్, యూనిట్ ఆఫ్ మాల ఖమ్మం జిల్లా నాయకుడు, అధ్యక్షుడు కందులు ఉపేందర్, జిల్లా కార్యదర్శి గుమ్మడి కనకరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు చిలకబత్తిని కనకయ్య, కోటేశ్వరరావు, కామల్ల కనకరత్నం, కందుల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు..



ఆర్థిక సాయం అందించాక నిర్వాహకులతో రాయల నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు రూ.30వేల ఆర్థిక సాయం నిర్వాహకులకు అందజేశారు. భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా, మొగల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి పోరాటాలు సాగించిన మహోన్నత వ్యక్తి సర్వాయి పాపన్నగౌడ్ అని ఆయన యొక్క విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంపాటి శ్రీనివాసరావు, మహేష్, దర్గయ్య, రాములు, శ్రీను, సాయి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా గుదిమళ్ల శాఖ ఆధ్వర్యాన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు గురువారం పంపిణీ చేశారు. బ్యాంక్ 116వ ఫౌండేషన్ డే సందర్భంగా 136 మంది విద్యార్థులకు అవసరమైన వాటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ డి. నరేష్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులకు ఈ వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది దివ్య, సురేఖ, సచిన్‌జోషి, నాగేశ్వరరావు, వెంకటేష్, పాఠశాల హెచ్‌ఎం బాలాజీ, ఉపాధ్యాయుడు డి. రాములు, అంగన్‌వాడీ సిబ్బంది కె.రాణి, పి.నాగమణి, నందిని తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట షురూ..


జిల్లాలో ముసురు పట్టడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా మున్నేరుకు వరద రావడంతో వివిధ రూపాల్లో చేపలు పట్టేందుకు కుస్తీ పడుతున్నారు. కొందరు గాలాలతో.. మరికొందరు వలలతో చేపలు పట్టారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



వలలతో చేపలు పడుతూ..



గాలాలతో.. యువకులు



బ్రిడ్జి పైనుంచి వల వేసి చేపలు పడుతున్న దృశ్యం

అటెన్షన్ ప్లీజ్

చెరువును తలపిస్తోంది..!



రఘునాథపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ సెంటర్ వద్ద చెరువును తలపించేలా నీటి నిల్వలు ఉన్నాయి. వార్డులు 2,3,7 వార్డుల్లో గత మూడేళ్ల నుంచి డ్రెయినేజీ లేకపోవడంతో నీరు నిల్వ చేరి కంపు కొడుతోంది. ఉదయం పిల్లలు, పెద్దలు ఇబ్బంది పడుతుంటే , సాయంత్రం వేళల్లో వాహనదారులు గుంతలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– రఘునాథపాలెం